క్లుప్తంగా

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మక్తల్: మక్తల్ బాలికల ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అధునాతన కంప్యూటర్ ప్రయోగశాల విద్యార్థులకు అత్యుత్తమ కంప్యూటర్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయ పడుతుందన్నారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మక్తల్ పట్టణంలో ఉద్యోగ విరమణ పొందుతున్న జి ఎల్లప్ప టీచర్ దంపతులను మక్తల్ ఎమ్మెల్యే శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఊట్కూరు: ఊట్కూరులోని రైతు వేదిక భవనంలో శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 42 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లింగం పాల్గొన్నారు.

గురుకులకు 10 మంది విద్యార్థుల ఎంపిక

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం ప్రాథమిక పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు శనివారం ప్రధానోపాధ్యాయులు తిమ్మప్ప తెలిపారు. 4వ తరగతికి చెందిన అమృత, అశ్విత, భానుశ్రీ, రేణుక, మేఘన, ఎం రేణుక, మంజుల, రేవతి, దర్శన్, రాఘవేంద్రలు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తిమ్మప్ప, ఉపాధ్యాయులు రమేష్, మాసన్న, కాశీం, శరణమ్మ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మద్దూరు: అనుమతి లేకుండా మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరారం వాగు నుంచి అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. వీరారం గ్రామానికి చెందిన రాఘవేందర్, తాళ్ల లక్ష్మణ్, పెద్దాపురం కన్నప్ప, ఎర్రపోల్ల చెన్నప్ప, తొల లక్ష్మయ్య చెందిన ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

రాష్ట్ర ప్లీనరీకి తరలిన యాదవులు

కోస్గి రూరల్: జాతీయ యాదవుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్లీనరీకి మండలంలోని యాదవులు భారీగా తరలివెళ్లినట్లు జాతీయ యాదవుల హక్కుల పోరాట సమితి నారాయణపేట జిల్లా అధ్యక్షులు హన్మంతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల ఫెడరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని, యాదవులకు మంత్రి పదవి, మూడు ఎమ్మెల్సీలు ఇవ్వాలని, రాష్ట్ర పాలడెయిరీ చైర్మన్, డైరెక్టర్లుగా నియమించాలని, యాదవులను కేటగిరి బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, మండల అధ్యక్షులు మోహన్, అమృత్, మహేష్, నవీన్, వెంకట్‌రాములు, తదితరులు ఉన్నారు.

బార్డర్ చెక్‌పోస్ట్ ఏర్పాటు

నారాయణపేట రూరల్: మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో అంతర్రాష్ట్ర సరిహద్దుపై చెక్ పోస్ట్‌ను శనివారం ఏర్పాటు చేశారు. రాబోయే రబీ సీజన్‌లో వరి కొనుగోళ్లకు సంబంధించి కర్ణాటక రాష్ట్రం నుంచి వరి ధాన్యం తెలంగాణకు రాకుండా అడ్డుకునేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులతో పూర్తిస్థాయి నిఘా పెట్టనున్నారు. వరి ధాన్యానికి సంబంధించి వాహనాల వే బిల్లులు కవిత వాటిని తనిఖీ చేసి, అనుమతి లేని వాహనాలపై చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాకపోకలు సాగించే ప్రతి వాహనానికి సంబంధించి నంబర్లను రిజిస్టర్లు నమోదు చేయాలని, వ్యాపారస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

దామరగిద్ద: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని మండల అధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీ నర్సప్ప, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, కిషన్‌రావ్, భీమయ్యగౌడ్‌లు అన్నారు. శనివారం మండలంలోని బీఆర్ఎస్ నాయకుడు బస్వంత్‌రాజ్ నివాసంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. మండల నాయకులు తిప్పన్న, మాజీ వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, భీమయ్యగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వన్నడ చంద్రకాంత్, సాయిరెడ్డి, మాణిక్యప్ప, శ్రీనివాస్‌శెట్టి, నారాయణ, వీరేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో దళారుల దోపిడీ


గుడెబల్లూర్ కొనుగోలు కేంద్రంలో మాయిచ్చర్ వచ్చిన వరి ధాన్యం

- జీరు, బిర్యానీ, రూ.4వేలు రైతులు ఇవ్వాల్సిందే..
- లేదంటే ధాన్యం తరలింపు ఉండదు
- ప్రతి బ్యాగ్‌కు రూ.1 కమీషన్ ఇస్తున్న మిల్లర్లు
- గన్నీ బ్యాగులు నుంచి ప్రతి చోట అవినీతే!


రైతులతో వాగ్వాదం చేస్తున్న లారీల కాంట్రాక్టర్(ఫైల్)

కృష్ణా: మండలంలోని రైతులు పండించిన వరి ధాన్యం ప్రభుత్వానికి విక్రయించేందుకు పడుతున్న పాట్లు అంతా ఇంతా కాదు. ఒక పక్క వర్షం వస్తే తమ ధాన్యం పాడవుతుందని భయం, మరో పక్క కొనుగోలు కేంద్రాల్లోని లారీ డ్రైవర్లు డబ్బులు తీసుకొని కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రెండురోజుల క్రితం గుడెబల్లూర్ గ్రామంలోని పీఏసీఎస్‌కు చెందిన వరి కొనుగోలు కేంద్రంలోని 0766 నంబర్ గల లారీ డ్రైవర్ ఓ రైతు నుంచి బీరుతో పాటు బిర్యానీ తిని మళ్లీ రూ.4వేలు తీసుకున్నాడు. అయినా ఆ రైతు ధాన్యంను లారీల్లో నింపకుండా మరో చోటుకు వెళ్లాడు. ఇలా ప్రతి రైతు నుంచి ధాన్యం తరలించేందుకు ఒక్కో రైతు లారీ డ్రైవర్లకు నాల్గు వేలు ఇవ్వాల్సిందే. లేదంటే ధాన్యం తీసుకెళ్లడానికి లారీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై లారీలను పంపించే కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఆయన డబ్బులు ఇవ్వడం రైతులదే తప్పు అన్నట్లు మాట్లాడారు. 'మిమ్మల్ని ఎవరు ఇవ్వమన్నారు. లారీ డ్రైవర్లకు డబ్బులు ఇవ్వకండి, డబ్బులు అడిగితే మాకు ఫిర్యాదు చేయండి' అంటూ రైతులతో వాగ్వివాదం చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి, కొత్తకోట సిద్ధార్థరెడ్డికి ఫిర్యాదు చేయడంతో వారు ఆ కాంట్రాక్టర్‌తో మాట్లాడినా పట్టించుకోలేదు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఈ విషయంపై తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని రైతులు సంతోష్, శివ, తదితరులు పేర్కొన్నారు. అధికారులు రైతులను ఆదుకునేందుకు ప్రయత్నించాలని కోరుతున్నారు.

లారీ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు



కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలంటే లారీలు కావాలి. అప్పుడు లారీ డ్రైవర్లు ఎంత అడిగితే అంత ఇవ్వక తప్పదు. ఒక్కో రైతు నుంచి రూ.3 నుంచి రూ.5వేలు తీసుకుంటున్నారు. ఈ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– వెంకటేష్, రైతు, గుడెబల్లూర్

మిల్లర్లు కూడా కమీషన్ అడుగుతున్నారు



రైతులు తమ ధాన్యంను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు తరలించిన తరువాత అక్కడ మిల్లర్లు కావాలనే ధాన్యం మాయిచ్చర్ లేదని, నూకలు అవుతున్నాయని చెబుతూ ఒక్కో బ్యాగుకు రూ.1 కమీషన్ అడుగుతున్నారు. ఇలా ప్రతి చోట రైతులను దోచుకుంటున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– శివ, గుడెబల్లూర్

భూ భారతితో రైతుల కష్టాలు తీరుస్తాం

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


మరికల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో పాతాళానికి పడిపోయిన రైతుల కష్టాలను తీర్చడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని మండల కాంప్లెక్స్ ఆవరణలో శనివారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక కష్టాలు అనుభవించారని, ఇప్పటికి ధరణి అంటే చాలా మంది రైతులకు తెలియదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధరణి చట్టాన్ని రద్దు చేసి నూతనంగా భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకరావడం జరిగిందన్నారు. ఈ కొత్త చట్టం ద్వారా భూ సమస్యలను తహసీల్దార్ స్థాయి నుంచి ఆర్డీఓ, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో సమస్యలను పరిష్కరించడం కోసం ఈ చట్టంలో వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొదట మద్దూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోని అక్కడ భూ భారతి చట్టాన్ని అమలు చేశామన్నారు. అక్కడ రికార్డులో తప్పులు, సాదా బైనమాల క్రమబద్ధీకరణ, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ తదితర సమస్యల పరిష్కారం అనంతరం జూన్ 2 తర్వాత అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఈ చట్టాన్ని అమలు చేసి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. భూ సమస్యలు పరిష్కారం తర్వాత భూ ఆధార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ కొండన్న, ఎంఈఓ మనోరంజని, ఏఓ షేక్ రహిమాన్, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, విండో అధ్యక్షులు వెంకట్రామారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ యువశక్తి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి


మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి

కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు స్వయం ఉపాధి నిమిత్తం, చేపట్టిన రాజీవ్ యువశక్తి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని నారాయణపేట జిల్లా జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం గుండుమాల్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు గుండుమాల్ మండలంలో 857, కోస్గి మండలంలో 816 దరఖాస్తులు అందాయన్నారు. సరైన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అంతకుముందు మండల ప్రత్యేకాధికారి రహమాన్ సందర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి యంపీడీఓ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లో విధుల ప్రారంభం


ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మరికల్: నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్‌లోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చిన తర్వాత శనివారం అధికారుల విధులను కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రారంభించారు. ఇటీవల నారాయణపేటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మరికల్ ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్‌ను కూడా అక్కడే ప్రారంభించారు. నెల రోజుల తర్వాత కలెక్టర్, ఎమ్మెల్యే పూజలు నిర్వహించి మండల కాంప్లెక్స్‌లోని తహసీల్దార్, మండల పరిషత్, మండల వనరుల కేంద్రం, వ్యవసాయ కార్యాలయం, మహిళా సమాఖ్య కార్యాలయాల విధులను ప్రారంభించారు. అన్ని శాఖల కార్యాలయాల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ కొండన్న, ఎంఈఓ మనోరంజని, ఏఓ షేక్ రహిమాన్, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సూర్యమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఆదర్శమైంది


రిటైర్డ్ అయిన ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఊట్కూరు: ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైందని రిటైర్డ్ ఎంఈఓ రామచంద్రాచారి అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓగా పదవీ విరమణ పొందిన రామచంద్రాచారిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎల్లప్పుడు నీతి నిజాయితీగా పనిచేయాలన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింగప్ప, కుసుమకుమారి, మాధవి, కృష్ణ, గురునాథ్, అనురాధ, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పశువుకు టీకాలు వేయాలి


భీంపూర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

మద్దూరు: పశువులకు సీజన్‌లో వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలను ఉమ్మడి మండలంలోని ప్రతి పశువుకు వేయాలని నివారణ టీకాల రాష్ట్ర పర్యవేక్షణాధికారి డాక్టర్ రషీద్ సిబ్బందికి ఆదేశించారు. శనివారం ఉమ్మడి మద్దూరు మండలంలోని భీంపూర్, నిడ్జింత, గోకుల్‌నగర్‌లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ మూడు గ్రామాల్లో 263 తెల్లజాతి పశువులకు, 101 గేదెజాతి పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి సబిత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విశాల, వీఏ అరుణ, యుద్ధంనాయక్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి


పెద్దాపూర్ నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: మండలంలోని పెద్దాపూర్, లింగాల్ చేడ్ గ్రామ పంచాయతీలలో పెంచుతున్న నర్సరీలను శనివారం ఎంపీడీఓ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున నర్సరీలలో మొక్కలు ఎండ తీవ్రతతో చని పోయే అవకాశం ఉంటుందని, పెంచే మొక్కలకు నర్సరీలలో షాడో నెట్, నీడ పందిరి, గాలి దుమారానికి ఎగిరి పోకుండా తగు చర్యలు తీకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. వర్షాకాలం నాటికి ప్రతి నర్సరీలో ఎంచుకున్న లక్ష్యం మేరకు మొక్కలను రక్షించాలన్నారు. అనంతరం పెద్దాపూర్ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నెహ్రూ నాయక్, శివరాజ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


మురహర్‌దొడ్డి గ్రామంలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కృష్ణా: విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందాలంటే కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని మురహర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఈరన్నగౌడ్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వచ్చే విద్యాసంవత్సరానికి తమ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వం అందించే సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు అజయ్, ఆకాంక్ష, అంగన్ వాడీ టీచర్ జయంతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపల్లి: మద్దూరు, కొత్తపల్లి మండలాల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులకు 20 తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొత్తపల్లి, మద్దూరు విద్యుత్ ఏఈలు బాల్‌రాజ్, నిరంజన్ దాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూరు నుంచి 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కొత్తపల్లి, గోకుల్ నగర్, విరారం, మోమినాపూర్ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా చేసే లైన్లలో చెట్లను, లూజు వైర్లను సరి చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు, వ్యాపార, గృహ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మరికల్: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని మరమ్మతుల కారణంగా ఆదివారం 11 గంటల నుంచి 3 గంటల వరకు మరికల్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురు గాలుల కారణంగా మరికల్ పట్టణంలో చెట్లు తగిలి తీగలు తెగడం, ఏబీ స్విచ్‌లు పని చేయకపోవడం వంటి వాటిన్ని మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపజేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు గోటూర్ విద్యార్థిని



ధన్వాడ: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు మండలంలోని గోటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శివరంజని ఎంపిక అయిందని హెచ్‌ఎం అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22న న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలలో 69 కేజీల విభాగంలో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. తమ పాఠశాల నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినికి శాలువాతో సన్మానించారు. జాతీయ స్థాయిలోను ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



మాగనూర్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మన్నెం తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. వేసవికాలం ఎండలు విపరీతంగా ఉంటున్నందున పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్‌ను నీటిలో కలుపుకుని తాగాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సీనియర్ మేటు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు


విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్న ప్రణయ్

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు శనివారం నగదు బహుమతులను అందజేశారు. మహబూబ్‌నగర్ డీటీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గాజుల ప్రణయ్ వారి తండ్రి శివకుమార్ జ్ఞాపకార్థం చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో హెచ్‌ఎం నరసింహచారి, ఉపాధ్యాయులు ఫరీదాసుల్తానా, సుభాషిని, అమూల్య, సురేష్, బాబు, వెంకటేష్, అశోక్‌కుమార్, నెల్సన్, శ్రీనివాస్‌లుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


పర్సపూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న అడిషన్ కలెక్టర్లు, ఆర్‌డీఓ తదితరులు

మద్దూరు: భూ భారతి కార్యక్రమంలో భాగంగా మద్దూరు మండలంలోని పర్సపూర్, పల్లెర్ల గ్రామాల్లో శనివారం రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పర్సపూర్ గ్రామంలో భూ సమస్యలపై 27 దరఖాస్తులు, పల్లెర్లలో 86 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ తెలిపారు. ఈ సదస్సులకు భూ భారతి కార్యక్రమం మండల ప్రత్యేకాధికారి, అడిషన్ కలెక్టర్ యాదగిరి, నారాయణపేట అడిషన్ కలెక్టర్(రెవెన్యూ) బెన్‌షాలోమ్, ఆర్‌డీఓ రాంచందర్‌లు రైతులు ఇచ్చే దరఖాస్తులు ఏ విధంగా నమోదు చేసుకోవాలి, సమస్య తదితర అంశాలను పరిశీలించి రెవెన్యూ సదస్సుల టీం సభ్యులకు సూచనలు ఇచ్చారు. పర్సపూర్‌లో తహసీల్దార్ మహేష్‌గౌడ్ టీం, పల్లెర్లలో డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవరావ్ టీంలు దరఖాస్తులను తీసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలి


జాజాపూర్ జెడ్పీ స్కూల్ ను సందర్శిస్తున్న చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు

నారాయణపేట రూరల్: రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించాలని డీఎస్ఓ భాను ప్రకాష్ సూచించారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను చుట్టుపక్కల గ్రామాలైన అప్పిరెడ్డిపల్లి, షేర్నపల్లి, సింగారం, అప్పక్ పల్లి, అమ్మిరెడ్డిపల్లి, నిడుగుర్తి, బసిరెడ్డి పల్లి గ్రామాలకు చెందిన 105 మంది 6, 9వ తరగతికి విద్యార్థులను శనివారం కలిశారు. ఆయా గ్రామాల్లో 5, 8వ తరగతి పూర్తి చేసుకునే విద్యార్థులు తదుపరి విద్యా బోధనకు ప్రభుత్వ పాఠశాలకే రావాలని, విశాలమైన భవనం, ఆటల మైదానం, డిజిటల్ బోధన, ప్రయోగశాల, గ్రంథాలయం తదితర వాటిని వీక్షించారు. మెరుగైన విద్య బోధనకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరిగిన గన్నీ బ్యాగులు సరఫరా


వర్కూర్‌లో చిరిగినపోయిన గన్నీ బ్యాగులకు గడ్డి పెట్టి కవర్ చేస్తున్న రైతులు

మాగనూర్: మండలంలోని రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గన్నీ బ్యాగులు నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో రైతులు కష్టపడి పండించిన పంట నాశనం అవుతుంటే.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు శాపంగా మారుతోంది. మండలంలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్న గన్నీ బ్యాగులు చిరిగిపోయి ఉండటంతో రైతులు ఆర్థిక భారం ఏర్పడుతోందని వాపోతున్నారు. వరి ధ్యానం నింపేందుకు వచ్చిన కూలీలకు బ్యాగులు కుట్టుకోవడం మరో పనిగా మారిందని ఆరోపిస్తున్నారు. కొందరు రైతులు చేసేది లేక అలాగే వడ్లను సంచులో నింపి గడ్డితో చిరిగిపోయిన చోట్లు కప్పుతున్నారు. మండలంలోని వర్కూర్ గ్రామానికి చెందిన రైతు కోరిబేని మారెప్ప దాదాపు 1400 గన్నీ బ్యాగులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి తీసుకురాగా, అందులో 90 శాతానికి పైగా చిరిగిపోయి ఉన్నాయి. ఇలాంటి గన్నీ బ్యాగులో ధాన్యం లోడ్ చేసుకున్ని తీసుకెళ్తే దారి మధ్యలోనే సగం సంచులో ధాన్యం రోడ్డు పాలవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు సరైన గన్నీ బ్యాగులు అందించడంతో పాటు ధాన్యంను తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

బీటీ వేశారు.. మట్టి మరిచారు

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ నుంచి బెక్కర్‌పల్లి, పెద్దకడ్మూర్ నుంచి సత్యవార్, పెద్దకడ్మూర్ నుంచి ఎల్లంపల్లి వరకు బీటీ వేశారు, మట్టి మరిచారని ప్రయాణికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ ఈ రహదారుల గుండా బీటీ పూర్తి చేసినప్పటికి ఇరువైపుల మట్టి వేయకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారుల గుండా అటు అమరచింత, ఇటు మక్తల్, గద్వాల్‌కు ఎంతో మంది ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ పరిస్థితుల్లో ఎదురుగా వాహనాలు వస్తే పూర్తిగా కిందకు దిగేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లే వారికి పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే కిందకు దిగే క్రమంలో మట్టి లేకపోవంతో తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వారు వాపోతున్నారు.